సాక్షి సిద్దిపేట

శుక్రవారం । 24 । మార్చి । 2023



ఉపాధి పనుల్లో అపశ్రుతి

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని జప్తిలింగారెడ్డి పల్లిలో గురువారం జరిగింది. 8లో..



పనులకు బిల్లులు రావడం లేదు

గ్రామంలో అభివృద్ధి పనులు చేసి ఏళ్లు గడుస్తున్నా బిల్లులు రావడం లేదని, తమ సమస్యలు పట్టించుకునే వారే కరువయ్యారని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. 9లో..

రంజాన్ వేళలు

శుక్రవారం ఇఫ్తార్	శనివారం సహర్
సా.06:55	ఉ.04:55

సదా మీ సాక్షి

ప్రజా సమస్యలు వెలుగులోకి.. | పరిష్కారానికి వారధి

సాక్షి దినపత్రిక జనం గొంతుకైంది. ప్రజాసమస్యలను వెలుగులోకి తెస్తూ వారధిగా నిలిచింది. అవినీతి, అక్రమాలను వెలికితీస్తూ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. ఎందరి వెతలకో అక్షర రూపం ఇచ్చి ఆపన్నహస్తం అందించేలా చూసింది. 'సత్యమేవ జయతే' అంటూ ప్రజాపక్షమైంది. గుడ్ మార్నింగ్... ఇదొక అందమైన మార్నింగ్ అంటూ పదిహేనేళ్లుగా పలకరిస్తూనే ఉంది. – సాక్షి, సిద్దిపేట, గజ్వేల్



గూడు.. గోడుపై

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్ రూంల నిర్మాణాలు పూర్తయి ఏళ్లు గడుస్తున్నా పేదలకు అందలేదంటూ గతేడాది ఏప్రిల్ 26 నుంచి 28వ తేదీ వరకు సాక్షి ప్రచురించిన వరుస కథనాలకు అధికారం యంత్రాంగం స్పందించింది. లబ్ధిదారుల ఎంపిక వేగవంతం చేసి డబుల్ బెడ్‌రూం ఇళ్లను అందజేశారు. దుబ్బాకలో గృహప్రవేశాలను అధికారులు, ప్రజాప్రతినిధులు దగ్గరుండి చేయించారు.

సాక్షి తోనే ఓ ఇంటికి ఓనరయ్యా



మాది దుబ్బాక. నేను బీడీకార్మికురాలిని, నా భర్త హోటల్‌లో పనిచేస్తున్నాడు. 20ఏళ్లుగా కిరాయి ఇంట్లోనే ఉన్నాం. మొదటగా, దుబ్బాకలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నా పేరు రాలేదు. ఇలాంటి ఇబ్బందే నాతో పాటు చాలామంది పడ్డారు. మా దయనీయ గాథను సాక్షి పత్రిక వెలుగులోకి తెచ్చింది. దీంతో నాకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయించారు. నాతోపాటు చాలా పేద కుటుంబాలకు ఇళ్లు వచ్చేలా కృషి చేసిన 'సాక్షి'కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు. నాకు ఇప్పుడు కిరాయి కట్టడం తప్పింది... ఇంటికి ఓనర్లం అయ్యాం.

–కారంపూరి లక్ష్మి, దుబ్బాక

ఓపెన్ ప్లాట్లకు పొజిషన్



ముంపు గ్రామాలైన ఏటిగడ్డకిష్టాపూర్, లక్ష్మాపూర్, వేములగాట్, పల్లెపహాడ్, రాంపూర్, బ్రాహ్మణబంజేరుపల్లి, ఎర్రవల్లి, సింగారం గ్రామాలకు చెందిన 5300పైగా కుటుంబాలు గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన ఆర్అండ్ఆర్ కాలనీలోకి 2021 మార్చి నెలలో వచ్చారు. పరిహారం, ప్యాకెజీలు, ఇళ్లు, ఓపెన్‌ప్లాట్లు, పాఠశాలల సమస్యలతో ఉక్కిబిక్కిరవుతున్నారు. వీరి సమస్యల పరిష్కారానికి అధికారులు పకడ్బందీ కార్యాచరణ అమలు చేయలేదు. ఈ క్రమంలోనే 'సాక్షి' దినపత్రికలో గతేడాది మే 19 నుంచి 21వరకు అంశాల వారీగా కథనాలు ప్రచురించింది. మంత్రి హరీశ్‌రావు స్పందించి పట్టాలిచ్చి పొజిషన్ ఇవ్వకుండా ఉన్న ఓపెన్ ప్లాట్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. 2022 మే 20న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ విజయేందర్ రెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు కాలనీని సందర్శించి, కొద్ది రోజుల్లోనే 2800కుపైగా ఓపెన్‌ప్లాట్లకు పొజిషన్ ఇప్పించారు.



ఆర్అండ్ఆర్ కాలనీలో ఓపెన్ ప్లాట్ల కేటాయింపు తర్వాత కొనసాగుతున్న నిర్మాణాలు

'సాక్షి'తోనే సమస్యలు వెలుగులోకి



ముంపు గ్రామాల సమస్యలను వెలికితీయడంలో 'సాక్షి' దినపత్రిక తనదైన పాత్రను పోషించింది. రోజుల తరబడి ఇబ్బందులను ఫోకస్ చేయడం వల్ల అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది.

– ప్రతాప్‌రెడ్డి, ఏటిగడ్డ కిష్టాపూర్

దందాకు చెక్

సిద్దిపేట పట్టణానికే కాదు తెలంగాణకే కొత్త అందాలు తెచ్చింది కోమటి చెరువు. ఇక్కడ వేలాడే వంతెన, నెక్లెస్ రోడ్, గ్లో గార్డెన్‌లను చూసేందుకు స్థానికులే కాదు ఇతర ప్రాంతాల నుంచి సైతం వేల సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారు. ప్రీ వెడ్డింగ్, బర్త్‌డే, వ్యక్తిగత ఫొటోలకు కేరాఫ్‌గా మారింది. ఫొటో షూట్‌కు రూ.3వేలు మున్సిపాలిటీకి చెల్లించాలి. దీనికి రశీదు ఇవ్వాలి కానీ, చిన్న చిట్టీ రాసి సొమ్ము చేసుకుంటున్న వైనంపై గతేడాది ఏప్రిల్ 16న కోమటి చెరువు...కొత్త దందా అనే శీర్షికతో కథనం ప్రచురించింది. దీంతో అప్పటి కమిషనర్ రవీందర్ రెడ్డి వెంటనే స్పందించి బిల్‌బుక్ ఏర్పాటు చేశారు. దీంతో కోమటి చెరువుకు ఫొటో షూట్‌లకు ఆదాయం మరింత పెరిగింది.





సాక్షి ఎఫెక్ట్: ముంపు గ్రామాల పాఠశాలల సందర్శించిన కలెక్టర్

విద్యార్థులకు అండగా...

గతేడాది జూన్ నెలలో విద్యా సంవత్సరం ప్రారంభమైనా వేములగాట్, ఏటిగడ్డకిష్టాపూర్, ఎర్రవల్లి హైస్కూల్‌లతోపాటు పల్లెపహాడ్ ప్రాథమికోన్నత పాఠశాల, నగరంతండా, తుర్కబంజేరుపల్లి, ఏటిగడ్డకిష్టాపూర్, బంజేరుపల్లితండా, బ్రాహ్మణబంజేరుపల్లి, వడ్డెర కాలనీ, ఎర్రవల్లి, సింగారం ప్రాథమిక పాఠశాలలు పునరుద్ధరణకు నోచుకోక విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. 2022 జూన్ 17న 'విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకం' శీర్షికన విద్యార్థుల వెతలను సాక్షి వెలుగులోకి తెచ్చింది. ఈ కథనానికి జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ స్పందించి జూన్ 23న నిర్వాసితుల కాలనీలో పాఠశాలల దుస్థితిపై స్వయంగా పరిశీలన జరిపారు. సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే ఆదేశాలిచ్చి పాఠశాలల పునరుద్ధరణకు మార్గం సుగమం చేశారు.



ముంపు గ్రామాల్లో పాఠశాలల దుస్థితి (ఫైల్)

మార్కెట్‌కు ఆదాయం



సిద్దిపేట పట్టణంలోని పశువుల సంతలో కొనుగోలు చేసిన వాటికి ధరలో ఒక శాతం మార్కెట్ ఫీజు కింద(రాదారి) చెల్లించాలి. ఆన్‌లైన్‌లో ఎంత ధరకు కొనుగోలు చేశారో చెప్పి మార్కెట్ ఫీజు చెల్లించి రశీదు పొందాలి. కొంత మంది సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తూ రూ.200 నుంచి రూ.300 తీసుకుంటూ మార్కెట్ ఆదాయానికి గండి కొడుతున్నారు. దీనిపై 'పక్కదారి' అనే శీర్షికతో గతేడాది నవంబర్ 28న సాక్షి ఓ కథనం ప్రచురించింది. దీంతో మార్కెట్ అధికారులు స్పందించి ప్రత్యేక నిఘా పెట్టారు. కొనుగోలు చేసిన ప్రతీ పశువుకు రాదారి చెల్లించే విధంగా చర్యలు తీసుకున్నారు.

న్యూస్‌రీల్

పంచాయతీలకు సతత్ వికాస్ పురస్కార్ అవార్డులు



సత్తత్ వికాస్ పురస్కార్ అవార్డులను అందిస్తున్న నాయకులు, అధికారులు

మర్కూక్(గజ్వేల్): ప్రతిగ్రామాన్ని మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దిన ఏకైక సీఎం కేసీఆర్‌అని రాష్ట్ర అటవీఅభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు సతత్ వికాస్ పురస్కార్ అవార్డులను గురువారం మర్కూక్ రైతు వేదికలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బృందం సభ్యులు మర్కూక్ మండలంలోని ప్రతి గ్రామాన్ని సందర్శించి అభివృద్ధిని చూసి ప్రశంసించారన్నారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు అద్భుతంగా ఉన్నాయని కేంద్ర బృందం గుర్తించి అవార్డులు ప్రదానం చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. సీఎం కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా సర్పంచ్‌లు కష్టపడి గ్రామాలను అభివృద్ధి చేసి రాష్ట్రానికే ఆదర్శంగా నిలిపారన్నారు. ప్రతి పంచాయతీలో పల్లె ప్రకృతివనాలు, రైతువేదికలు, సీసీ రోడ్లు, డంప్‌యార్డులు, వైకుంఠధామాలు చేపట్టి స్వచ్ఛ గ్రామాలుగా మార్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పాండుగౌడ్ జెడ్పీటీసీ సభ్యురాలు మంగమ్మరాంచంద్రం, కరుణాకర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, కృష్ణయాదవ్, కౌసల్యదేవి, సీడీపీఓ వెంకటరాజమ్మ, ఎంపీడీఓ ప్రవీణ్, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 3 నుంచి పదోతరగతి వార్షిక పరీక్షలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వచ్చే ఏప్రిల్ 3వ తేదీ నుంచి 13 వరకు పదోతరగతి వార్షిక పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల ఎగ్జామ్ జరుగుతుందన్నారు. హాల్‌టికెట్టు శుక్రవారం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

ఏప్రిల్ 25 నుంచి ఓపెన్ స్కూల్ ఎగ్జామ్స్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వచ్చే ఏప్రిల్ 25వ తేదీ నుంచి ఓపెన్ స్కూల్ (టెన్త్, ఇంటర్) పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 25 నుంచి మే 4వరకు థియరీ, మే 12 నుంచి మే 19 వరకు ఇంటర్ ప్రాక్టికల్స్ ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ వెంకటస్వామి (8008403635)ని సంప్రదించాలన్నారు.

రోగులతో ఆప్యాయంగా మాట్లాడాలి

- ఆస్పత్రిలో డెలివరీల సంఖ్య మరింత పెంచాలి
- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో లాప్రోస్కోపిక్ విభాగాన్ని ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు



వ్యాక్యూమ్ పరికరాలను ప్రారంభిస్తున్న అర్చన

సిద్దిపేటకమాన్: ఆస్పత్రికి వచ్చిన రోగులతో ఆప్యాయంగా, ఆత్మీయంగా మాట్లాడాలి..ఇక్కడ అందుతున్న వైద్య సేవలను ప్రజలకు వివరించాలని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ జనరల్ ఆస్పతిలో ఈసీఐఎల్ ప్రతినిధుల సహకారంతో రూ.70 లక్షల విలువైన లాప్రోస్కోపీ, వ్యాక్యూమ్ సేవలను జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఈసీఐఎల్ ప్రతినిధి బృందంతో కలిసి మంత్రి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని పలు విభాగాల్లో తిరుగుతూ వైద్య సేవలు అందుతున్న తీరుపై రోగులు, వారి బంధువులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. మందులు వేసుకునే విధానం గురించి పెషేంట్స్‌కు వివరించాలని మెడికల్ స్టోర్ సిబ్బందికి సూచించారు. అనంతరం ఆస్పత్రిలో వైద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఈసీఐఎల్ కంపెనీ సహకారంతో లాప్రోస్కోపీ, వ్యాక్యుమ్ పరికరాలను అందించిన అర్చన సురేష్, వారి ప్రతినిధి బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఆస్పత్రిలో ఆపరేషన్లు చేసిన తర్వాత ఇన్‌ఫెక్షన్ అనే మాట ఉండొద్దని, ఇన్‌ఫెక్షన్ సోకకుండా కావాల్సిన పరికరాలు కొనుగోలు చేయాలన్నారు. జిల్లాలో 99.9 శాతం ఇన్సిట్యూషనల్ డెలివరీలు జరుగుతున్నాయని, వాటిలో 66 శాతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో 33.9 శాతం ప్రైవేటులో జరుగుతున్నాయన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్లు ఎక్కువగా అవుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని దీనిపై జిల్లా కలెక్టర్, వైద్య బృందం తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఓపీకి ఎంతమంది వస్తున్నారని ఆరా తీయగా, ప్రతిరోజు వివిధ విభాగాల్లో 900 నుంచి 1200 వరకు వస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. గర్భిణులు వ్యాయామం చేసేలా ఒక నర్సును ఏర్పాటు చేయాలని లేదంటే వార్డులోని ఓ హాల్‌లో గర్భిణులు ధ్యానం చేసేలా ఒక టీవీ స్ట్రీన్ ఏర్పాటు చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్‌కు సూచించారు. నంగునూరు మండలంలోని ఘనపూర్‌లో మహిళలను డెలివరీ కోసం ఎక్కడకు వెళ్లారని అడిగితే, ప్రైవేట్ మెడికల్ కళాశాల, ఇతర ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లినట్లు చెప్పారని, ఎందుకు వెళ్లారని అడిగితే ఆస్పత్రిలో సిబ్బంది మాట్లాడే తీరు బాగోలేదన్నారని, ఇక నుంచి ప్రతి ఒక్కరూ రోగులతో ఆప్యాయంగా మాట్లాడాలని మరోసారి తన వద్దకు ఇలాంటి ఫిర్యాదులు రావొద్దని సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యుడు పాల సాయిరాం, డిప్యూటీ సూపరింటెండెంట్ డీఎంహెచ్ఓ డాక్టర్ కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండగలు జరగాలి



సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల తదితరులు

సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

సిద్దిపేటజోన్: ప్రశాంత వాతావరణంలో పండగలు జరుపుకుందామని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్స్ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సంపత్, వైస్ చైర్మన్ కనకరాజు, ఏసీపీ దేవారెడ్డితో కలిసి పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీరామనవమి, రంజాన్, హనుమాన్ ర్యాలీలను ప్రశాంతంగా చేపట్టాలని సూచించారు. ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. దేవాలయం, మసీదు వద్ద పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు తిరుమల్‌రెడ్డి, మోహిజ్, ఎల్లం, సుందర్, రాజేశం, శ్రీహరి, వజీర్, శ్రీకాంత్, రాజు, చంద్రం, ముస్లిం మతపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఆరేసిన దుస్తులు తీస్తుండగా..

విద్యుదాఘాతంతో విద్యార్థికి గాయాలు

దుబ్బాక: ఆరేసిన దుస్తులు తీస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి ఓ విద్యార్థికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని దుంపలపల్లి వార్డుకు చెందిన ఓ మహిళకు దుబ్బాకలో డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరైంది. 48వ బ్లాక్‌లో 9వ ఇంట్లో ఆమె నివాసం ఉంటోంది. బంధువైన సిద్దిపేటకు చెందిన 9వ తరగతి విద్యార్థి మహేశ్ ఉగాది సందర్భంగా దుబ్బాకలోని ఆమెకి ఇంటికి వచ్చాడు. మేడపై ఆరేసిన దుస్తులు గురువారం తీస్తుండగా, విద్యుత్ వైర్లు తాకడంతో కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుంది. మహేశ్‌ను చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సాగుబడి

- సేంద్రియ పద్ధతుల్లో కూరగాయల సాగు
- మధ్యాహ్న భోజనానికి వినియోగం



కూరగాయలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యాబుద్ధులు నేర్పిస్తూనే సాగుబడిలోనూ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాదు..ఆ పాఠశాల ఆవరణలో పండించిన కూరగాయలను మధ్యాహ్నభోజనంలోనూ వినియోగిస్తున్నారు. మండల పరిధిలోని చంద్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలహెచ్‌ఎం పద్మారెడ్డి, ఉపాధ్యాయుల ఆలోచనతో బడిని సాగుబడిగా మార్చారు. విద్యార్థులకు పాఠాలు బోధిస్తూనే మరోవైపు కూరగాయల సాగుపై దృష్టి సారించారు. ఇక్కడ అన్ని రకాల ఆకుకూరలు, టమాట, వంకాయ, బెండకాయ, పచ్చిమిర్చిని ఎలాంటి క్రిమిసంహారక మందులు ఉపయోగించకుండా సేంద్రియ పద్ధతుల్లో సాగుచేస్తున్నారు. తద్వారా మధ్యాహ్న భోజన నిర్వహణకు అక్కడ సాగు చేసిన కూరగాయలు ఉపయోగించడంతో కొంత మేర నిర్వహణ భారం తగ్గించుకుంటున్నారు.

పాఠశాలల రూపురేఖలు మారాయి



మన ఊరు- మన బడి పనులను పరిశీలిస్తున్న శ్రీధర్‌రెడ్డి

నంగునూరు(సిద్దిపేట): మన ఊరు మన బడి పథకంతో పాఠశాలల రూపురేఖలు మారా యని మన ఊరు-మనబడి రాష్ట్ర కమిటీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని బద్దిపడగ, నంగునూరు, రాజగోపాల్‌పేట ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా పాఠశాలలు బలోపేతం అవుతాయన్నారు. పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, వంట గదులు, మంచినీరు, టాయిలెట్స్, ప్రహరీ నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి రామస్వామి, ఎంఈఓ దేశిరెడ్డి, పాఠశాల హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌ను ప్రత్యామ్నాయ పంటగా ఎంచుకోవాలి



ఆయిల్‌పామ్ తోటలను పరిశీలిస్తున్న అధికారులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతులు ప్రత్యామ్నాయపంటగా ఆయిల్‌పామ్ సాగు చేసి లాభాలబాట పట్టాలని జిల్లా వ్యవసాయఅధికారి శివప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని ఇటిక్యాల గ్రామంలో ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయక నూనెగింజల పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్ ఐదు నుంచి ఆరురేట్ల అధిక దిగుబడి వస్తుందన్నారు. నాటిన నాలుగో ఏడాది నుంచి కాపు మొదలై 30 ఏళ్ల వరకు నిరంతర దిగుబడి పొందవచ్చన్నారు. ఇతర పంటలతో పోలిస్తే పంటకు తెగుళ్లు, చీడపీడల సమస్య తక్కువన్నారు. ఆయన వెంట ఏడీ వసంతరావు, ఏఈఓ, రైతులు ఉన్నారు.

క్లుప్తంగా

రైతు మృతి


కట్ట డెవిడ్ (ఫైల్)

రామాయంపేట(మెదక్): మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన రైతు పొలానికి వెళ్లి అకస్మాత్తుగా మృతిచెందాడు. రైతు కట్ట డేవిడ్ (35) గురువారం ఉదయం పొలంలో ఉన్న బోరు వద్దకు వెళ్లి వరిపంటను చూసి అక్కడే చెట్టుకింద కూర్చొని మృతిచెందాడని గ్రామస్తులు తెలిపారు. గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని వారు భావిస్తున్నారు. డెవిడ్ మృతికి సర్పంచ్ బొడ్డు శంకర్, ఉప సర్పంచ శైలజ, ఎంపీపీ ఉపాధ్యక్షురాలు స్రవంతి సంతాపం వ్యక్తంచేశారు.

డాక్టర్ హేమరాజ్‌సింగ్‌కు ఎంపీ పరామర్శ


హేమరాజ్‌సింగ్ ను పరామర్శిస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్‌సింగ్‌ను గురువారం మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

వ్యక్తి ఆత్మహత్య

చేగుంట(తూప్రాన్): కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన చేగుంట మండల పరిధిలోని చందాయిపేటలో జరిగింది. చేగుంట ఎస్ఐ ప్రకాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం చందాయిపేట గ్రామానికి చెందిన తలారి నరేందర్ (32) పెద్ద శివనూర్ గ్రామానికి చెందిన నాగలక్ష్మిని తొమ్మిదేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నాడు. వివాహమైన కొన్ని రోజులకే గొడవలు ప్రారంభమైయాయి. వీరికి వర్షిణి కూతురు ఉంది. దీంతో అత్తగారి ఊరిలోనే ఉంటూ నరేందర్ మేస్త్రీ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. తరచూ భార్యాభర్తలు గొడవపడుతున్నారు. 20 రోజుల క్రితం భార్యను వదిలి స్వగ్రామం వచ్చి తల్లివద్దే ఉంటున్నాడు. బుధవారం ఇంటిలో ఉరివేసుకున్నాడు. మృతుడు తల్లి మల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

మందుబాబులకు జరిమానా, జైలు

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా, ఒకరికి జైలుశిక్ష విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తమ సిబ్బందితో పట్టణంలోని ప్రధాన చౌరస్తాల్లో మూడు, నాలుగు రోజుల క్రితం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించగా 11 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని గురువారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ అనంతరం జడ్జి వారికి రూ.23,500 జరిమానా, వీరిలో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు సీఐ తెలిపారు.

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు

బెజ్జంకి(సిద్దిపేట): మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమానులపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బెజ్జంకి ఎస్ఐ ప్రవీణ్‌రాజు హెచ్చరించారు. బెజ్జంకిలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన పత్రాలు లేకున్నా, రాష్ డ్రైవింగ్ చేసినా వాహనదారులపై కేసులు నమోదు చేస్తామన్నారు. మైనర్ల తండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

నదికి కొత్త నడక నేర్పిన కేసీఆర్

- బ్రహ్మంగారి ఊహకు అందని తీరు
- అవార్డులతో పోటీతత్వం
- పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో మంత్రి టి.హరీశ్‌రావు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్ రావు

సిద్దిపేటజోన్: ఒకప్పుడు సహజసిద్ధమైన ప్రవాహాన్ని కల్గి ఉండే నది నడకను కాళేశ్వరం లాంటి భారీ ప్రాజెక్టు ద్వారా నదికి కొత్త నడక నేర్పిన గొప్ప వ్యక్తి సీఎం కేసీఆర్ అని, ఆయన మదిలో మెదిలిన ఆలోచన వల్ల పరిస్థితులను బట్టి నది దిగువ ప్రాంతం నుంచి ఎగువకు పారేలా డిజైన్ చేయడం జరిగిందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విపంచి ఆడిటోరియంలో పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్ అవార్డుల ప్రధాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు గురించి కాలజ్ఞానం రాసిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కూడా ఇది రాయకపోవచ్చు, అలా నదికి కొత్త నడక సీఎం కేసీఆర్ నేర్పిన విషయాన్ని నది రివర్స్ ప్రవాహం తీరును మంత్రి వివరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు అప్పగిస్తే ఇక తెలంగాణ భవిష్యత్ ఉంటుందా అని ప్రశ్నించారు. అవార్డుల గ్రామాల మధ్య పోటీ తత్వం నిలుపుతుందని, సిద్దిపేటకు అవార్డులు కొత్త కాదన్నారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని 60 అవార్డులు పొందిన గ్రామాల పాలకవర్గం, అధికారులను సన్మానించారు.

8121 మందికి కిట్స్ పంపిణీ

తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా సిద్దిపేట నియోజకవర్గ పరిధిలోని 8121 మంది బోధకాల వ్యాధి పీడితులకు రూ.40 లక్షలతో మందులు, సబ్బులు సామగ్రి కిట్స్ పంపిణీ చేశారు.

పూర్తి హక్కుదారులు

ప్రభుత్వం జీఓ58.59 ద్వారా పూర్తి హక్కుపత్రాలు ఇస్తుందని ఇక మీరే హక్కుదారులని మంత్రి పేర్కొన్నారు. జీఓ 58, 59 కింద 600మందికి రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు.

ఏర్పాట్లు అద్భుతంగా చేయాలి

శ్రీరామనవమి, రంజాన్ పండుగ ఏర్పాట్లు అద్భుతంగా చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. కలెక్టర్ ప్రశాంత్ జె.పాటిల్, పోలీస్ కమిషనర్ శ్వేత, జెడ్పీ చైర్మన్ రోజాశర్మ, ఎమ్మెల్సీ ఫారూఖ్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఏప్రిల్ 14న హైదరాబాద్ లో 125 అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని హుస్సేన్ సాగర్ వద్ద ఆవిష్కరణ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో మహనీయుల జయంతి వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం

సాక్షి, సిద్దిపేట: ఇవాళ తెలంగాణ పల్లెల్లో గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం కనిపిస్తున్నదని మంత్రి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే అవార్డులలో దేశంలో 10 అవార్డులకు గాను 7 అవార్డులు రాష్ట్రం సాధిస్తున్నదన్నారు. బీజేపీ నాయకులు ఢిల్లీలో అవార్డులను ఇచ్చి.. గల్లీలో విమర్శిస్తున్నారన్నారు. తెలంగాణలో యాసంగి 57 లక్షల ఎకరాల వరిసాగయితే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 16లక్షల ఎకరాలలో వరిసాగు అవుతుందన్నారు. గతంలో నీరు, గడ్డి లేక పశువులను కబేళాలకు అమ్ముకునేవారన్నారు. తెలంగాణలో కరువు అనే పదాన్ని డిక్షనరీ నుంచి తొలగించామని స్పష్టం చేశారు. రైతుల నాణ్యమైన కరెంట్ కోసం రోజుకు రూ 70 కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజారాధాక్రిష్ణ శర్మ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అపశ్రుతి

- ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి మృతి
- పరామర్శించిన డీఆర్‌డీవో గోపాల్‌రావు


ప్రభుత్వ ఆస్పత్రిలో రాజు మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ గోపాల్‌రావు

తొగుట(దుబ్బాక): ఉపాధి పనుల్లో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లిలో గురువారం జరిగింది. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బ్యాగరి ఉమ్మరాజు (31) ఉపాధి పనికి వెళ్లాడు. పొలాల్లో చల్లేందుకు చెరువు మట్టిని ట్రాక్టర్‌లో తరలిస్తున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి పల్టీకొట్టింది. దీంతో రాజు ట్రాక్టర్ కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన తోటి కూలీలు గ్రామస్తుల సహాయంతో చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో కన్నుమూశాడు. మృతుడికి భార్య సుజాత, పిల్లలు చందనశ్రీ (5), శివ మహేష్ (3), తల్లిదండ్రులున్నారు. విషయం తెలుసుకున్న డీఆర్‌డీవో గోపాల్‌రావు ప్రభుత్వ ఆస్పత్రి మార్చరీలో ఉమ్మరాజు మృతదేహన్ని పరిశీలించారు. అనంతరం అతడి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఎంపీడీవో శ్రీధర్, సర్పంచ్ జ్యోతి మల్లారెడ్డి, ఏపీఓ కిషన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కనకయ్య, సీనియర్ నాయకుడు గాందారి నరేందర్‌రెడ్డి ఉన్నారు.

దొంగ అరెస్ట్

వారం క్రితం జైలు నుంచి విడుదల

పటాన్‌చెరు టౌన్: 27 దొంగతనాలకు పాల్పడిన దొంగ వారం క్రితం జైలు నుంచి విడుదలయ్యాడు. పటాన్‌చెరు పరిధిలోని పాన్ డబ్బాలో చోరీకి పాల్పడి తిరుగుతున్న దొంగను పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. క్రైం ఎస్ఐ పవన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సాపూర్‌కు చెందిన వడ్డే కుమార్ అలియాస్ సంపంగి శివకుమార్ ఈనెల 21వ తేదీన పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో పాన్‌షాపులో చోరీకి పాల్పడ్డాడు. దాదాపు రూ.10 వేలపైగా విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లాడు. దీంతో పాన్‌షాపు నిర్వాహకుడు పోలీసులను ఆశ్రయించాడు. అతడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. గురువారం పటాన్‌చెరు మండలం ముత్తంగి సమీప హోటల్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వడ్డే కుమార్ అలియాస్ శివకుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా ఇస్నాపూర్ పాన్‌షాపులో చోరీ చేసినట్లు అంగీకరించాడు. అంతేకాక గతంలో మెదక్, జోగిపేట, సంగారెడ్డి, పటాన్‌చెరు, చందానగర్ ప్రాంతాల్లో 27 దొంగతనాలను చేసి ఆరుసార్లు జైలుకు వెళ్లివచ్చినట్లు చెప్పాడు. పాన్‌షాపులో ఎత్తుకెళ్లిన సామగ్రిని స్వాధీనంచేసుకుని రిమాండ్‌కు తరలించారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

హాజరైన కలెక్టర్, ఎమ్మెల్యే


ప్రతిష్ఠ పూజలో ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి చాకరిమెట్ల శ్రీసహకార ఆంజనేయస్వామి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం కన్నుల కొనసాగుతోంది. దాత దశరథ్‌రెడ్డి ఆలయ నిర్మాణం చేపట్టారు. శుక్రవారం ధ్వజస్తంభం, సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ఆలయ ఈఓ సార శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు ప్రభుశర్మ, రాధకిషాన్‌శర్మ, దేవిశ్రీ, సిబ్బంది శ్రీనివాస్, రామకృష్ణ, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠలో కలెక్టర్, ఎమ్మెల్యే

గురువారం జరిగిన విగ్రహ ప్రతిష్ఠ పూజా మహోత్సవానికి కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి హాజరయ్యారు. ఆంజనేయస్వామి సన్నిదానంలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణం అద్భుతంగా ఉందని కలెక్టర్ అన్నారు. కామారెడ్డి వాస్తవ్యులు రవీందర్‌రావు దంపతులు సత్యనారాయణస్వామి వెండి మూల విరాట్ విగ్రహం గురువారం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. వారిని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ సన్మానించారు. కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీధర్‌యాదవ్, జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా, నర్సాపూర్ ఆత్మకమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్‌రామిరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్ బాలమణి, ఎంపీటీసీ దశరథ్, బీఆర్ఎస్ నాయకులు పైడి శ్రీధర్‌గుప్తా, కొడకంచి శ్రీనివాస్‌గౌడ్, నారాయణరావు, దర్శన్‌రావు, నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

పేస్కేల్ అమలుపై సెర్ప్ ఉద్యోగుల హర్షం


ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డిని సన్మానిస్తున్న సెర్ప్ ఉద్యోగులు

గజ్వేల్‌రూరల్: గ్రామీణ పేదిరక నిర్మూలన సంస్థ(సెర్ప్)లో విధులు నిర్వహిస్తున్న తమకు పేస్కేల్ అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. గురువారం గజ్వేల్ పట్టణంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సెర్ప్ ఉద్యోగులు మాట్లాడుతూ గత 23 ఏళ్లుగా గ్రామీణ ప్రజలను చైతన్యవంతులను చేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు మహిళలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుభాష్, ఏపీఎంలు ఆనంద్‌కుమార్, శ్రీనివాస్, ఎస్. యాదగిరి, యాదగిరి, శైలజ, నియోజకవర్గ పరిధిలోని సీసీలు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంతో స్వయం ఉపాధి

- కేవీకే శాస్త్రవేత్త రవికుమార్
- తునికి కేవీకేలో రైతులకు శిక్షణ


తునికి కేవీకేలో తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్త రవికుమార్

కౌడిపల్లి(నర్సాపూర్): ఆధునిక శాస్త్రీయ పద్ధతుల ద్వారా తేనెటీగల పెంపకంతో రైతులు, యువతకు స్వయం ఉపాధి లభిస్తుందని కేవీకే శాస్త్రవేత్త రవి కుమార్ తెలిపారు. గురువారం కౌడిపల్లి మండలం తునికి వద్ద గల (కృషి విజ్ఞాన కేంద్రం) కేవీకేలో రైతులు, యువకులకు అగ్రికల్చర్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, యువత వ్యవసాయంతో పాటు అనుబంధంగా తేనెటీగల పెంపక చేపట్టవచ్చన్నారు. తక్కువ ఖర్చుతో మంచి లాభాలు వస్తాయని, ప్రభుత్వం సైతం సహకరిస్తుందని తెలిపారు. స్వచ్ఛమైన తేనెకు మంచి గిరాకి ఉందని, వినియోగం అధికంగా ఉన్నప్పటికీ ఉత్పత్తి తక్కువగా ఉందన్నారు. ఉత్సాహవంతులు తేనెటీగల పెంపకం చేపట్టడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఆధునిక, శాస్త్రీయ పద్ధతుల ద్వారా తేనెటీగలను పెంచవచ్చన్నారు. పొలాల్లో వ్యవసాయానికి అనుబంధంగా తేనెటీగలను పెంచితే పరపరాగ సంసర్గం జరిగి అధిక దిగుబడి లభిస్తుందన్నారు. ఎంపిక చేసిన రైతులకు 25 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు ఉదయ్, ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్, అనూష రైతులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో విజిలెన్స్ దాడులు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ మండలం నారాయణపూర్ గ్రామంలో ట్రాన్స్‌కో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. కరెంటు మీటర్ లేకుండా విద్యుత్ స్తంభాలపై నుంచి నేరుగా విద్యుత్ వినియోగిస్తున్న నక్క రవి, నక్క శివరాములు పై కేసు నమోదు చేసినట్లు ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ రామచంద్రరావు తెలిపారు.

అభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లండి

- రాష్ట్ర ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి
- సన్నాహక సమావేశంలో నాయకులకు పిలుపు


మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

తూప్రాన్: ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ రాష్ట్ర ఫుడ్స్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డితో కలిసి సన్నహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలు, సభ్యత్వం తీసుకున్నవారు, పార్టీ సానుభూతిపరులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నాట్లు తెలిపారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సూచనల మేరకు తూప్రాన్ ఉమ్మడి మండలంలోని మనోహరాబాద్‌లో ఏప్రిల్ 1న, తూప్రాన్‌లో ఏప్రిల్ 4న ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని సూచించారు. మెదక్ ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత శేఖర్‌గౌడ్‌తో నియోజకవర్గ ఇన్‌చార్జిలు హాజరవుతారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు స్పందించి కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, తదితర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు భాగనవ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఆంజనేయులుగౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి సతీశ్‌చారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిర్వాకం

విద్యార్థులతో బెంచీలు మోయించిన వైనం


బెంచీలను మోసుకువెళ్తున్న విద్యార్థులు

వట్‌పల్లి(అందోల్): విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులే విద్యార్థులతో బెంచీలు మోయించిన తీరు విమర్శలకు దారితీసింది. గురువారం వట్‌పల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ప్రధాన రహదారిలో గల ఫర్నిచర్ షాపు నుంచి పాఠశాల వరకు దాదాపు అర కిలోమీటర్ మేర బెంచీలను మోసుకుంటూ తీసుకువెళ్లారు. విద్యార్థులను చూసిన పలువురు తీసిన ఫొటో వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అయ్యింది. ఈ విషయంపై హెచ్‌ఎం బాలయ్యను వివరణ కోరగా విద్యార్థులతో బెంచీలు మోయించలేదని, విద్యార్థులే అత్యుత్సాహంతో కొద్ది దూరం మోసుకొచ్చి మళ్లీ ఫర్నిచర్ షాపు వద్దే ఉంచారని తెలిపారు. ఎంఈఓ బి.కృష్ణను వివరణ కోరగా వాట్సాప్‌లో వచ్చిన ఫొటోలను చూసి హెచ్‌ఎంను ప్రశ్నించగా రెండు బెంచీలను మాత్రమే తెచ్చారని తెలిపాడని, విద్యార్థులతో ఎటువంటి పనులు చేయించరాదని సూచించినట్లు తెలిపారు.

ఆన్‌లైన్ అప్పుతో ముప్పు

సిద్దిపేటకమాన్: ఆన్‌లైన్ యాప్ నిర్వాహకులు ఇష్టారీతిగా వడ్డీలు వసూలు చేయడం మొదలు, వారు అడిగినంత ఇవ్వకుంటే మానసికంగా వేధిస్తున్నారు. ఆన్‌లైన్‌లో లోన్ యాప్ ద్వారా ఓ మహిళ తీసుకున్న రుణం వడ్డీతో సహా చెల్లించినా ఇంకా డబ్బులు చెల్లించాలని లేదంటే ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ సంఘటన సిద్దిపేట పట్టణంలో గురువారం జరిగింది. టూటౌన్ సీఐ రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణానికి చెందిన ఓ మహిళ ఆన్‌లైన్‌లో లోన్ యాప్ ద్వారా కొంత మొత్తాన్ని అప్పుగా తీసుకుంది. ప్రతీ నెల వడ్డీతో సహా చెల్లించింది. అయితే సదరు లోన్ నిర్వాహకులు లోన్ డబ్బులు ఇంకా చెల్లించాలని లేదంటే మార్ఫింగ్ చేసిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తామని తనను, తన కుటుంబ సభ్యులను మానసికంగా ఇబ్బందులు పెడుతున్నారని బాధితురాలు జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ లోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకోకూడదని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

మండలానికి రూ.78.5 లక్షల సీడీపీ నిధులు

ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి


మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట మండలానికి సీడీపీ నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్సీ శేరి సుభాశ్ రెడ్డి తెలిపారు. గురువారం మధ్యాహ్నం హవేలీఘన్‌పూర్ మండలం కూచన్ పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో పాపన్నపేట మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలకు మంజూరు పత్రాలు అందజేశారు. అభివృద్ధి పనులకు సంబంధించి రూ.78.5 లక్షల రూపాయల నిధులను సీడీపీ నుంచి కేటాయించినట్లు ఎమ్మెల్సీ వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కుబేరుడు, సర్పంచులు శ్రీనాథరావు, లింగారెడ్డి పార్టీ, మండల బీఆర్ఎస్ నాయకులు గోపాల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ఏడుకొండలు, విఠల్, ఆశయ్య, రామతీర్థం కురుమ సంఘం అధ్యక్షుడు సాయిలు, ఏడుపాయల దేవస్థానం మాజీ డైరెక్టర్ చెన్నగౌడ్ పాల్గొన్నారు.

భగత్ సింగ్ జయంతి, వర్ధంతులను నిర్వహించాలి

రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి మన్నె కుమార్


భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన వీరుడు భగత్‌సింగ్ అని, భగత్‌సింగ్ జయంతి, వర్ధంతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ (ఆర్ఎస్పీ) ఉమ్మడి జిల్లా కార్యదర్శి మన్నే కుమార్ అన్నారు. భగత్‌సింగ్ 92వ వర్ధంతి సందర్భంగా ఆర్ఎస్పీ, ఏఐపీఎస్‌యూ, ఆర్‌వైఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మన్నెకుమార్ మాట్లాడుతూ దేశం కోసం 23 ఏళ్ల వయసులోనే ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలన్నారు. భగత్‌సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలన్నారు. అదేవిధంగా దేశంలో ఉన్న నిరుద్యోగ యువతకు భగత్‌సింగ్ నేషనల్ గ్యారంటీ పథకం పేరుతో ఎంప్లాయిమెంట్ యాక్ట్‌ను అమలు చేయాలన్నారు. నూతన విద్యా విధానాన్ని రద్దు చేస్తూ కేజీ టు పీజీ ఉచిత విద్యను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల జిల్లా నాయకులు కొండ ప్రశాంత్, జోగారి రాజు, ఒగ్గు రమేశ్, అప్పాల కృష్ణ, శివ, దరిపల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వడగళ్లతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి


అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సిద్దిపేటరూరల్: అకాల వర్షాలు, వడగళ్ల వానతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.50 వేలు ఇచ్చి ఆదుకోవాలని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ గురువారం కిసాన్ మోర్చా సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొలిపాక రాజు ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజన పథకాన్ని తెలంగాణలో అమలు చేయకపోవడం వల్ల ఇటువంటి విపత్కర పరిస్థితుల నుంచి రైతాంగాన్ని ఆదుకునే అవకాశాన్ని చేజేతుల కోల్పోతున్నామన్నారు. అకాల వర్షాలు, వడగళ్ల వానతో జిల్లాలోని రైతాంగం పంట నష్టపోవడంతో ఆందోళన చెందుతున్నారన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టపోయిన రైతుల వివరాలు సేకరించి సమగ్ర నివేదిక తయారు చేయాలని, జిల్లాలోని రైతు సంఘాలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి పంట తీవ్రతను అంచనా వేయాలని డిమాండ్ చేశారు. నష్టపరిహారం అందించడంలో ప్రభుత్వం ఉదాసీనత ప్రదర్శిస్తే బీజేపీ పక్షాన రైతుల కోసం పోరాడతామని హెచ్చరించారు. ఇకనైనా తెలంగాణలో ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలుపరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కురిక్యాల రాములు, గుండ్ల జనార్ధన్, మెరుగు భూమేశ్ గౌడ్, కిసాన్ మోర్చా నాయకులు గద్దమీది రామస్వామి, పరకాల తిరుపతిరెడ్డి, మన్నే శీను, పాలకొల్లు వెంకటరెడ్డి, చల్లారం రమేశ్ రెడ్డి, మార్కండి ఎగొండ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడాలి

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సురేశ్


సంగారెడ్డిలో భగత్ సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): హిందూత్వ మతోన్మాద విధానాలను వ్యతిరేకించడంతో పాటు ప్రజాస్వామ్య లౌకిక విలువల పరిరక్షణకు పోరాడాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సురేశ్ పిలుపునిచ్చారు. భగత్ సింగ్ 92వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం సంగారెడ్డిలోని జాతీయ రహదారిపై ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ ఏనిమిదేళ్ల మోడీ ప్రభుత్వ హయాంలో దళితులు, బడుగు, బలహీన వర్గాలు, ఆదివాసుల పక్షాన మాట్లాడే వారిని అక్రమంగా జైలులో నిర్బంధిస్తూ మతం పేరుతో, కులం పేరుతో ప్రజాస్వామ్య విధ్వంసకర పాలన చేస్తున్నారని విమర్శించారు. సమసమాజ స్థాపనే లక్ష్యంగా ఒక కులం, మరొక కులాన్ని ఒక మతం, మరొక మతాన్ని దోపిడీ, పీడనలేని సమాజ స్థాపనకు తన ప్రాణాన్ని భగత్ సింగ్ త్యాగం చేశాడని గుర్తు చేశారు. అన్యాయాలను, అక్రమాలను ప్రశ్నిస్తే వారిని దేశ ద్రోహులుగా ముద్ర వేస్తూ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. భగత్ సింగ్ కలలు కన్నా తమ సమాజ స్థాపన కోసం విద్యార్థి యువత నడుంబిగించి పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఓ వైపు పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు రాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులను విద్యకు దూరం చేయాలని చూస్తున్నారన్నారు. మరో వైపు ఎంతో కష్టపడి చదివిన వారిని టీఎస్‌పీఎస్‌సీ నిర్లక్ష్యం వల్ల పేపర్ లీక్ చేసి నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడాలని చూస్తున్నారని, తక్షణమే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోకపోతే రాబోవు రోజుల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధార్థ, జిల్లా సహాయ కార్యదర్శి గంజి హర్షిత్, జిల్లా కోశాధికారి ఆర్ శ్రీకాంత్, డివిజన్ నాయకులు పవన్ కల్యాణ్, శివ సాయి, తదితరులు పాల్గొన్నారు.